సాక్షి
కాకినాడ
మంగళవారం । 9 । జూలై । 2024



అన్నదాన భవనానికి విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో అన్నదాన భవన నిర్మాణానికి వడ్ల పూడి హరిబాబు (ఆర్.పంగిడిగూడెం) రూ.55,250 విరాళం సమర్పించారు.



నిత్యాన్నదానానికి రూ.50,116

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని నిత్యాన్నదాన ట్రస్టుకు మల్లిడి సంతోష్‌కుమార్ రెడ్డి దంపతులు (రావులపాలెం మండలం గోపాలపురం) రూ.50,116 అందజేశారు.



పంచారామ క్షేత్రంలో రూ.లక్ష

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో నిత్యాన్నదానానికి యర్రపోతిన వెంకటరామ చౌదరి, ఆశారాణి దంపతులు (హైదరాబాద్) సోమవారం రూ.లక్ష విరాళం సమర్పించారు.

న్యూస్‌రీల్

కలెక్టరేట్ గ్రీవెన్స్‌కు 405 అర్జీలు

కాకినాడ సిటీ: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (గ్రీవెన్స్)కు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు 405 అర్జీలు సమర్పించారు. వారి నుంచి జిల్లా రెవెన్యూ అధికారి డి.తిప్పే నాయక్, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి, సీపీఓ పి.త్రినాథ్, జిల్లా గృహనిర్మాణ సంస్థ పీడీ ఎస్‌వీవీ సత్యనారాయణ, జెడ్పీ సీఈఓ ఎ.శ్రీరామచంద్రమూర్తి, డీపీఓ భారతీ సౌజన్య, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎం.లావణ్య అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ, భూ తగాదాలు, పింఛన్ల వంటి అంశాలపై ఎక్కువ మంది అర్జీలు సమర్పించారు. వీటిని సత్వరమే పరిష్కరించాల్సిందిగా ఆయా శాఖల అధికారులను డీఆర్‌ఓ ఆదేశించారు.

పెండింగ్ ప్రాజెక్టుల మంజూరుకు సహకరించాలి



ప్రధాని మోదీని కలిసిన ఎంపీ ఉదయ్ శ్రీనివాస్

సాక్షి ప్రతినిధి, కాకినాడ: జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టుల మంజూరుకు సహకరించాలని ప్రధాని నరేంద్ర మోదీని కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ కోరారు. ఢిల్లీలో ఆయన ప్రధానిని కలిశారు. ఈ మేరకు ఎంపీ కార్యాలయం సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. కాకినాడ పోర్టు అభివృద్ధి, కేంద్ర సంస్థల ఏర్పాటు, పెండింగ్ రైల్వే ప్రాజెక్టుల మంజూరులో ఉదారంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. పిఠాపురం నియోజవర్గంలో ఉప్పాడ తీర ప్రాంతం, టెంపుల్ సర్క్యూట్ అభివృద్ధితో పాటు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు సహకారం అందించాలని కోరారు. అమరావతిని దేశంలోనే మోడల్ రాజధానిగా తీర్చిదిద్దడంతో పాటు ఆంధ్రుల జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసేందుకు సహకరించాలన్నారు. వీటిపై ప్రధాని సానుకూలంగా స్పందించారని, అభివృద్ధి పనులకు దశల వారీగా సహకారం అందిస్తామన్నారని ఎంపీ తెలిపారు.

సముద్రంలోకి 44 వేల క్యూసెక్కులు



కాటన్ బ్యారేజీ నుంచి సముద్రంలోకి విడుదలవుతున్న మిగులు జలాలు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం సాయంత్రం 44,031 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. మొత్తం 175 గేట్లకు గానూ ధవళేశ్వరం ఆర్మ్‌లో 45, ర్యాలి ఆర్మ్‌లో 10, మద్దూరు ఆర్మ్‌లో 5, విజ్జేశ్వరం ఆర్మ్‌లో 10 కలిపి మొత్తం 70 గేట్లు పైకి లేపి మిగులు జలాలను వదులుతున్నారు. ఖరీఫ్ సాగుకు సంబంధించి డెల్టా కాలువలకు 9,700 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 3,600, మధ్య డెల్టాకు 2,100, పశ్చిమ డెల్టాకు 4 వేల క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులుగా కొనసాగుతోంది.

కమిషనర్ పోస్టు ప్లీజ్..

రాజమహేంద్రవరం కార్పొరేషన్ స్థానానికి జేసీ ప్రయత్నాలు!



జేసీ తేజ్‌భరత్

సాక్షి, రాజమహేంద్రవరం: నూతన ప్రభుత్వం ఏర్పడింది. తమకు అనుకూలమైన అధికారుల నియామకానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటికే ఐఏఎస్‌ల బదిలీ ప్రక్రియ పూర్తయింది. త్వరలో ఐపీఎస్‌లకు కూడా స్థానచలనం కలగనుంది. ఇదే సమయంలో జేసీ స్థాయి అధికారుల బదిలీ సైతం అనివార్యమనే సంకేతాలు టీడీపీ శ్రేణుల నుంచి వెలువడుతున్నాయి. ఈ నేపథ్యంలో తమకు అనుకూలమైన స్థానాలు దక్కించుకునేందుకు ఎవరి స్థాయిలో వారు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. తమకు పరిచయం ఉన్న నేతలను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో ప్రస్తుత జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ కమిషనర్ స్థానంపై కన్ను వేశారని తెలుస్తోంది. ఈ మేరకు పది రోజుల పాటు సెలవు పెట్టిన ఆయన ఆయన ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ పోస్టు కోసం మంత్రి లోకేష్‌ను సైతం ఆయన కలిశారని చెబుతున్నారు. లోకేష్ తన క్లాస్‌మేట్ అని, తప్పకుండా కమిషనర్ పోస్టు సాధించుకుంటానని సన్నిహితుల వద్ద ప్రస్తావించారని తెలుస్తోంది.

మహానేతా.. మనసా స్మరామి

- ఘనంగా వైఎస్సార్ జయంతి వేడుకలు
- దివంగత ముఖ్యమంత్రికి నేతలు, ప్రజల నివాళి
- విస్తృతంగా సేవా కార్యక్రమాలు



తుని వైఎస్సార్ జయంతి సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి దాడిశెట్టి రాజా



కరపలో నివాళులర్పిస్తున్న దివ్యాంగుడు శ్రీనివాస్

సాక్షి ప్రతినిధి, కాకినాడ: కృతజ్ఞతా భావం ఉన్న ఏ ఒక్కరూ ఇతరులు చేసిన ఉపకారాన్ని జీవితంలో ఏనాటికీ మరచిపోరు. మేలు చేసి ఎన్నేళ్లయినా ఆ జ్ఞాపకాలను హృదయాల్లో పదిలంగానే ఉంచుకుంటారు. ఆ వ్యక్తి ప్రజానాయకుడైతే ఏనాటికీ విడదీయరాని అనుబంధాన్నే కొనసాగిస్తూంటారు. అలా తన ప్రజారంజక పాలనతో జనం హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహానేత.. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చేసిన మేలును జిల్లా ప్రజలు ఇప్పటికీ గుర్తు పెట్టుకునే ఉన్నారు. ఆయన 75వ జయంతిని జిల్లావ్యాప్తంగా సోమవారం పండగ వాతావరణంలో ఘనంగా నిర్వహించుకున్నారు. తమ చిన్నచిన్న జీవితాలకు నాడు ఆయన చేసిన సాయాన్ని స్మరించుకుంటూ ఆ మహనీయునికి మనసారా నివాళి అర్పించారు. రైతు పక్షపాతిగా రైతుల ప్రయోజనాలకు పెద్ద పీట వేస్తూ వైఎస్ తీసుకున్న అనేక నిర్ణయాలను గుర్తుకు తెచ్చుకున్నారు. ఎక్కడికక్కడ ప్రజలు, పార్టీ రహితంగా నాయకులు, కార్యకర్తలు ఈ వేడుకల్లో స్వచ్ఛందంగా పెద్ద ఎత్తున పాల్గొని తమ అభిమాన నేత నిలువెత్తు విగ్రహాలను, చిత్రపటాలను పూలమాలలతో అలంకరించారు. మహానేత విగ్రహాల వద్ద వైఎస్సార్ సీపీ శ్రేణులు కేకులు కట్ చేసి, మిఠాయిలు పంచిపెట్టి వైఎస్‌పై తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు. ముఖ్యమంత్రిగా రాజశేఖరరెడ్డి తమ ప్రాంతానికి చేసిన మేలును గుర్తు చేసుకుంటూ ఘనంగా నివాళులర్పించారు.

- కాకినాడ బాలాజీ చెరువు జంక్షన్‌లో వైఎస్ నిలువెత్తు విగ్రహాన్ని పూలమాలలతో అలంకరించి, ఘనంగా నివాళులర్పించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు, సిటీ అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న సాగర్ పాల్గొని కేక్ కట్ చేశారు.
- పిఠాపురం మున్సిపల్ కార్యాలయం వద్ద వైఎస్ విగ్రహానికి మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వంగా గీతా విశ్వనాథ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి, అభిమానులకు, కార్యకర్తలకు పంచారు. ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.
- జగ్గంపేటలో వైఎస్సార్ జయంతి వేడుకలను కో ఆర్డినేటర్ తోట నరసింహం, మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు నిర్వహించారు. వైఎస్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం, కేక్ కట్ చేశారు.
- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ దవులూరి దొరబాబు ఆధ్వర్యాన పెద్దాపురం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ప్రజలు, పార్టీ కార్యకర్తలు మహానేత వైఎస్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సామర్లకోట సిరి మానసిక వికలాంగుల కేంద్రంలోని విద్యార్థులకు, సామాజిక ఆరోగ్య కేంద్రంలోను రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

తెలుగువారికి గొప్ప గుర్తింపు తెచ్చిన మహా నాయకుడు

కాకినాడ రూరల్: తెలుగు వారికి గొప్ప గుర్తింపు తీసుకువచ్చిన మహా నాయకుడు వైఎస్ రాజశేఖరరెడ్డి అని, ఆయన 75వ జయంతి వేడుకలను జిల్లా వ్యాప్తంగా పండగలా నిర్వహించామని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు అన్నారు. రమణయ్యపేట వైద్య నగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన వైఎస్ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. 'జోహార్ వైఎస్సార్' అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ, వైఎస్సార్ అంటేనే ఒక స్ఫూర్తి అని అన్నారు. వైఎస్సార్ గుర్తొస్తే ఆ చిరునవ్వు, ఆ నాయకత్వం, పేదల సంక్షేమం కోసం పడిన తపన ఇప్పటికీ మరచిపోలేమని అన్నారు. ఆయన మరణించి దాదాపు 15 ఏళ్లయినా ప్రజల గుండెల్లో ఇప్పటికీ చిరస్థాయిలో నిలిచిపోయారని కొనియాడారు. వైఎస్సార్ స్ఫూర్తితోనే ఆయన తనయుడు, గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేశారని, దురదృష్టవశాత్తూ ఈ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధించలేకపోయిందని అన్నారు. జయాపజయాలకు అతీతంగా ప్రజలతో నడవాలని, కష్టనష్టాల్లో వారికి తోడు ఉండాలనే వైఎస్సార్ స్ఫూర్తితో ముందుకు వెళతామని చెప్పారు. ప్రతి కార్యకర్తకు, ప్రతి కుటుంబానికి అండగా ఉంటామని, ఎలాంటి ఒడుదొడుకులు వచ్చినా ప్రజల కోసం నిలబడతామని స్పష్టం చేశారు.



వైద్య నగర్‌లో మహానేత విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు తదితరులు

కాపులకు బాబు, పవన్ న్యాయం చేయాలి

తుని: కూటమి ఇచ్చిన హామీలు, పవన్ కల్యాణ్‌పై నమ్మకంతో కాపులు గంపగుత్తగా ఓట్లు వేశారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా వారికి సీఎం చంద్రబాబు, పవన్ న్యాయం చేయాలని మాజీ మంత్రి దాడిశెట్టి రాజా డిమాండ్ చేశారు. తుని శ్రీరామా సెంటర్‌లో జరిగిన వైఎస్ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. కేక్ కట్ చేసి, వైఎస్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానికి అండగా నిలిచిన కాపులను బీసీల్లో చేర్చే బాధ్యతను ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీసుకోవాలన్నారు. కేంద్రం, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఉందని, కాపులను బీసీల్లో ఏవిధంగా చేర్చాలో రాష్ట్ర ప్రభుత్వానికి ప్రధాని నరేంద్ర మోదీ చెప్పాలని, ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశామని తెలిపారు. బీసీ కోటాకు అన్యాయం జరగకుండా కాపులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేసి, చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ చిరుద్యోగులపై యనమల రామకృష్ణుడు వేటు వేస్తున్నారని, ఇది సబబు కాదని చెప్పారు. తమ ప్రభుత్వ హయాంలో ఎవ్వరికీ అన్యాయం చేయలేదనే విషయాన్ని గుర్తించాలన్నారు. కూటమి ప్రభుత్వం బాధ్యతగా నడచుకోవాలన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులపై వేధింపులకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. ఎవరికి అన్యాయం జరిగినా పోరాటం చేస్తామని రాజా స్పష్టం చేశారు. పద్ధతి మార్చుకోకపోతే నిలదీయడానికి తామంతా సిద్ధగా ఉన్నామని వైఎస్సార్ సీపీ నేత యనమల కృష్ణుడు అన్నారు.

త్వరలో కొత్త ఈఓ!

- అన్నవరం దేవస్థానానికి నియమించే అవకాశం
- మొదలైన కసరత్తు
- అదనపు కమిషనర్ బాధ్యతలు అప్పగించడంతో ప్రస్తుత ఈఓకు పని భారం



అన్నవరం: సత్యదేవుని సన్నిధికి త్వరలోనే నూతన కార్యనిర్వహణాధికారి(ఈఓ)ని నియమించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర దేవదాయ, ధర్మాదాయ శాఖ ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నారు. ప్రస్తుత ఈఓ కె.రామచంద్ర మోహన్ రాష్ట్ర దేవదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో అడిషనల్ కమిషనర్–2గా కూడా అదనపు విధులు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. గత నెలలోనే ఆయనకు ఈ బాధ్యతలు అప్పగించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆ శాఖలో అసిస్టెంట్ కమిషనర్ నుంచి రీజినల్ జాయింట్ కమిషనర్ (ఆర్‌జేసీ) క్యాడర్ వరకూ సిబ్బందికి సంబంధించిన ఫైళ్లను ఆయన పరిష్కరించాల్సి ఉంది. దీంతో పాటు అన్నవరం దేవస్థానం పరిపాలనలో కీలక నిర్ణయాలు కూడా తీసుకోవాల్సి ఉంటోంది. మూడు వారాలుగా ఆయన ఈ రెండు బాధ్యతలు ఆయన నిర్వహిస్తున్నారు. సోమవారం నుంచి గురువారం వరకూ కమిషనర్ కార్యాలయంలో, మిగిలిన మూడు రోజులు అన్నవరం దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్నారు. ఇలా రెండుచోట్లా పని చేయడం ఇబ్బందికరమే. వాస్తవానికి అన్నవరం దేవస్థానం ఈఓది ఆర్‌జేసీ క్యాడర్ స్థాయి పోస్టు. రామచంద్ర మోహన్‌ది అంతకంటే ఎక్కువ స్థాయి కలిగిన అడిషనల్ కమిషనర్ పోస్టు. అంతే కాకుండా కమిషనర్ కార్యాలయంలో అప్పగించిన కీలక బాధ్యతలతో ఆయన అక్కడే ఉండాల్సిన అవసరం ఉంది. దీనికి తోడు అన్నవరం దేవస్థానంలో కూడా పూర్తి స్థాయి ఈఓ ఉండాల్సిన అవసరం ఉంది. దీంతో రామచంద్ర మోహన్‌ను కమిషనర్ కార్యాలయానికి పరిమితం చేసి, అన్నవరం దేవస్థానానికి కొత్త ఈఓను నియమించనున్నట్లు సమాచారం.

నూతన ఈఓగా సత్యనారాయణమూర్తి?



అన్నవరం దేవస్థానం ఈఓగా వచ్చేందుకు పలువురు ఆర్‌జేసీలు ఇప్పటికే ప్రయత్నాలు చేస్తున్నారు. వీరిలో తిరుపతి ఆర్‌జేసీ ఎస్‌వీ సత్యనారాయణమూర్తి పేరు బలంగా వినిపిస్తోంది. ఆయన 2022 జూలై నుంచి గత ఏడాది మార్చి వరకూ అన్నవరం దేవస్థానం ఈఓగా పని చేశారు. ఆ సమయంలో వివాదాలకు తావు లేకుండా పరిపాలన సాగించారు. వ్యక్తిగత కారణాలతో గత ఏడాది మార్చిలో రెండు వారాలు సెలవు పెట్టడంతో ఆయన స్థానంలో దేవదాయ, ధర్మాదాయ శాఖ ఎస్టేట్ అధికారిగా పని చేస్తున్న ఎస్ఎస్ చంద్రశేఖర్ ఆజాద్‌ను ఇన్‌చార్జి ఈఓగా నియమించారు. ఆ తరువాత వర్క్ అడ్జస్ట్‌మెంట్ పేరుతో ఆయనను దేవస్థానంలో కొనసాగించారు. సత్యనారాయణమూర్తిని కమిషనర్ కార్యాలయంలో నియమించారు. ఆ తరువాత ఆయనను తిరుపతి ఆర్‌జేసీగా నియమించారు. ఇటీవల శ్రీకాళహస్తి దేవస్థానం ఈఓ రిటైరవడంతో అక్కడ ఫుల్ అడిషనల్ చార్జి (ఎఫ్ఏసీ) ఈఓగా కూడా నియమించారు. గతంలో అన్నవరం దేవస్థానం ఈఓగా కొద్ది నెలల వ్యవధిలోనే బదిలీ చేసినందున తనను తిరిగి ఆ స్థానంలో నియమించాలని సత్యనారాయణమూర్తి ప్రభుత్వ పెద్దలను కోరగా, ఆ మేరకు ఆయనకు అభయం లభించిందని సమాచారం. దీనికి తోడు కొంత మంది ఉన్నతాధికారులు కూడా సత్యనారాయణమూర్తిని ఈఓగా నియమించాలని సిఫారసు చేసినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆయనను ఇక్కడ ఈఓగా నియమిస్తూ వారం రోజుల్లో ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉందని చెబుతున్నారు.

వంతుల వారీగా ఏలేరు సాగునీరు

- నేటి నుంచి అమలు
- కలెక్టర్ షాన్ మోహన్



కలెక్టర్ షాన్ మోహన్

కాకినాడ సిటీ: కిర్లంపూడి, పెద్దాపురం, పిఠాపురం మండలాల్లోని ఏలేరు ఆయకట్టుకు ఈ నెల 9 నుంచి నవంబర్ 5 వరకూ మొత్తం 120 రోజుల పాటు వంతుల వారీ విధానంలో సాగు నీరు సరఫరా చేయనున్నారు. కలెక్టర్ షాన్ మోహన్ సగిలి సోమవారం ఈ విషయం తెలిపారు. ప్రతి 10 రోజులకు ఒక వంతు చొప్పున, తొలి 4 రోజుల పాటు పిఠాపురం మండలానికి, తదుపరి మూడు రోజులు పెద్దాపురం మండలానికి, ఆపై 3 రోజుల పాటు కిర్లంపూడి మండలానికి రోజుకు నీరు సరఫరా చేస్తామని వివరించారు. ఈ మేరకు ఏలేరు జలాశయం నుంచి 700, తిమ్మరాజు చెరువు నుంచి 50 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తామన్నారు. జలాశయంలో నీటి లభ్యత తక్కువగా ఉన్నందున అందుబాటులో ఉన్న నీటిని సమర్థంగా వినియోగించేందుకు వంతుల వారీ విధానం అమలు చేస్తున్నామన్నారు. దీనికి రైతులు సహకరించాలని కోరారు. ఈలోపు ఏలేరు జలాశయం తగిన స్థాయిలో నిండితే వంతుల వారీ విధానం రద్దు చేసి, తిరిగి పాత పద్ధతిలో నీరు సరఫరా చేస్తామని తెలిపారు. వంతుల వారీ విధానం సమర్థంగా అమలు చేసి, ఎక్కడా సాగునీటి సమస్య రాకుండా చూడాలని ఏలేరు డివిజన్ ఇరిగేషన్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

నీటి విడుదల తేదీలు

- పిఠాపురం మండలం: ఈ నెల 9–12, 19–22, ఈ నెల 29–ఆగస్టు 1, ఆగస్టు 8–11, 18–21, 28–31, సెప్టెంబర్ 7–10, 17–20, 27–30, అక్టోబర్ 7–10, 17–20, 27–30 తేదీలు.
- పెద్దాపురం మండలం: ఈ నెల 13–15, 23–25, ఆగస్టు 2–4, 12–14, 22–24, సెప్టెంబర్ 1–3, 11–13, 21–24, అక్టోబర్ 31–నవంబర్ 2 తేదీలు.
- కిర్లంపూడి మండలం: ఈ నెల 16–18, 26–28, ఆగస్టు 5–7, 15–17, 25–27, సెప్టెంబర్ 4–6, 14–16, 24–26, అక్టోబర్ 4–6, 14–16, 24–26, నవంబర్ 3–5 తేదీలు.

సమాజ సేవకా సలాం...

- ఎన్‌సీసీతో క్రమశిక్షణ, దేశభక్తి
- భావిభారత రక్షకులుగా క్యాడెట్లు
- కోనసీమలో బెటాలియన్ యూనిట్‌కు సన్నాహాలు

రాయవరం: దేశమంటే అభిమానం.. సమాజ సేవ చేయాలన్న తపన నింపేదే నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ).. విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తి పెంచడమే లక్ష్యంగా అధికారులు జాతీయ యువ సైనిక దళాన్ని తయారు చేస్తున్నారు. ఇదిలా ఉంటే కొత్తగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో బెటాలియన్ యూనిట్ ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఇప్పటికే రామచంద్రపురం, అమలాపురం, ముమ్మిడివరం, ఐ.పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, అమలాపురం, రామచంద్రపురం డిగ్రీ కళాశాలల్లో ఎన్‌సీసీ యూనిట్లు ఉండగా, జిల్లాలో మరో 30 వరకూ ఎన్‌సీసీ యూనిట్లు ఏర్పాటు చేయనున్నారు. అందుకు సర్వే చేస్తున్నారు. 1959లో 32వ ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ ఏర్పాటైంది. ప్రధానంగా శరీర దారుఢ్య పరీక్షలు నిర్వహించి, క్రీడా నైపుణ్యం కలిగిన విద్యార్థులను ఎన్‌సీసీలో చేర్చుకుంటారు. ఆ విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఉన్నత ఆశయాలు, నిర్మాణాత్మక నాయకత్వ లక్షణాలు పెంచుతారు. వీరికి డ్రిల్ పరేడ్, మ్యాప్ రీడింగ్, సమాజ సేవ, మానవ హక్కులు, దేశభక్తి తదితర అంశాలపై శిక్షణ ఇస్తారు. ఏటా 30 నుంచి 50 పరేడ్లు నిర్వహిస్తారు. ఎన్‌సీసీ శిక్షణలో ఉత్తీర్ణులైన క్యాడెట్లకు ఏ, బీ, సీ సర్టిఫికెట్లు అందిస్తారు.

కొత్తగా యూనిట్ల ఏర్పాటు

కాకినాడ జిల్లా కేంద్రంగా 8వ ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ యూనిట్ ఉంది. అయితే రాజోలు, సఖినేటిపల్లి వంటి దూర ప్రాంతాలకు కాకినాడ నుంచి వచ్చి ఎన్‌సీసీ ఆఫీసర్లు పర్యవేక్షణ చేయడం కష్టమవుతోంది. ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రాంత విద్యార్థులనూ ఎన్‌సీసీలో భాగస్వామ్యం చేయాలనే ఉద్దేశంతో కోనసీమ జిల్లాలోనూ బెటాలియన్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. అమలాపురం కేంద్రంగా బెటాలియన్ యూనిట్ ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలో 24 ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాలల్లో ఎన్‌సీసీ యూనిట్ల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. అదేవిధంగా ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్/డిగ్రీ కళాశాలల్లో ఆరు ఎన్‌సీసీ యూనిట్లను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు అవసరమైన సర్వే నిర్వహిస్తున్నారు. విజయవాడ నుంచి వచ్చిన హవల్దార్ క్యాడర్ అధికారి ఆధ్వర్యంలో ఎన్‌సీసీ ఏర్పాటుకు అనువైన పాఠశాలలు, జూనియర్ కళాశాలలు ఎంపిక చేసే పనిలో ఉన్నారు. 8వ తరగతిలో 50 మందికి పైగా విద్యార్థులు ఉన్న పాఠశాలలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. 8, 9 తరగతుల నుంచి 100 మంది వరకూ బ్యాచ్‌కు తీసుకునే అవకాశం ఉంది. ఈ విధంగా జిల్లాలో ఏటా 1,500 మంది విద్యార్థులు ఎన్‌సీసీ క్యాడెట్లుగా తయారయ్యే అవకాశముంది. 42 ఏళ్ల లోపు వయస్సు కలిగి, తగిన అర్హతలు ఉన్న ఉపాధ్యాయులను తొలుత కేర్ టేకర్‌గా ఎంపిక చేస్తారు. ఆ తదుపరి వీరికి మహారాష్ట్రలో శిక్షణ అనంతరం అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్‌గా నియమిస్తారు.



శిక్షణ పొందుతున్న ఎన్‌సీసీ విద్యార్థులు

విద్య, ఉద్యోగాల్లోనూ ప్రాధాన్యం

ఎన్‌సీసీలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్యాడెట్లకు గుర్తింపుతో పాటు వివిధ స్థాయిల్లో ప్రాధాన్యం ఉంటుంది. ఇంటర్ నుంచి మెడికల్, ఇంజినీరింగ్, పీజీ, పీహెచ్‌డీ కోర్సులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విద్యా, ఉద్యోగాలు, శిక్షణ కార్యక్రమాల్లో ఎన్‌సీసీకి ప్రత్యేక రిజర్వేషన్ కోటా కల్పిస్తున్నారు. జిల్లాలోని రామచంద్రపురం, అమలాపురం, ముమ్మిడివరం, ఐ.పోలవరం పాఠశాలల్లో ఎన్‌సీసీ గ్రూపులు ఉన్నాయి. ఇలా మొత్తం 400 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు శిక్షణ పొందుతున్నారు. వీరు శ్రమదానాలతో పాటు పర్యావరణ పరిరక్షణ, ఎయిడ్స్ నిర్మూలన, వన మహోత్సవాలు, వరకట్న వ్యతిరేక ర్యాలీలు, విపత్తుల విరాళాల సేకరణ, పల్స్ పోలియోపై అవగాహన ఇలా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

చేరేందుకు ఆసక్తి



గ్రామీణ ప్రాంతాల్లో సైతం ఎన్‌సీసీపై విద్యార్థులకు మక్కువ ఉంది. అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్‌గా నెలలో కనీసం నాలుగు పీరియడ్లు విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నా. విద్యార్థులు కూడా ఆసక్తిగా శిక్షణలో పాల్గొంటున్నారు. దీనిద్వారా వారిలో దేశభక్తి, క్రమశిక్షణ, సేవా దృక్పథం పెరుగుతోంది.

–సీహెచ్ అబ్బులు, అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్, జెడ్పీహెచ్ఎస్, ముమ్మిడివరం

జిల్లాకు గొప్ప అవకాశం



జిల్లాలో 8వ ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ యూనిట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. దీనిద్వారా ఏటా అనేక మంది క్యాడెట్లు శిక్షణ పొందుతారు. అమలాపురం కేంద్రంగా బెటాలియన్ ఎన్‌సీసీ యూనిట్ ఏర్పాటు కావడం జిల్లాకు గర్వకారణం. కాకినాడ గ్రూపులో ఒక భాగంగా ఈ యూనిట్ ఉంటుంది.

–ఉప్పలపాటి మాచిరాజు, ఎన్‌సీసీ చీఫ్ ఆఫీసర్, జెడ్పీహెచ్ఎస్, కె.ఏనుగుపల్లి లంక

ప్రాధాన్యం ఇస్తున్నాం



ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఎన్‌సీసీ యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. ఎన్‌సీసీ వింగ్‌కు సంబంధించిన అధికారులు సర్వే నిర్వహిస్తున్నారు. విద్యార్థుల సంఖ్య అధికంగా ఉన్న పాఠశాలల్లో ఏర్పాటుకు ప్రాధాన్యం ఇస్తున్నాం.

–ఎం.కమలకుమారి, డీఈఓ, అమలాపురం

క్లుప్తంగా

ఇరువర్గాల ఘర్షణ
ఐదుగురికి గాయాలు



ఏలేశ్వరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

ఏలేశ్వరం: ఇరువర్గాల ఘటనలో ఐదుగురికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. ఏలేశ్వరం పెద్దవీధికి చెందిన చింతపల్లి నూకరాజు, ఆశా దంపతులు. వీరి మధ్య కొంతకాలంగా వివాదాలు నడుస్తున్నాయి. ఉపాధి కోసం నూకరాజు చెన్నైలో ఉంటుండగా ఆశా ఏలేశ్వరంలో ఉంటుంది. తన తండ్రి మృతి చెందడంతో నూకరాజు ఏలేశ్వరం వచ్చాడు. దీంతో భార్యాభర్తల మధ్య ఉన్న గొడవలు చెలరేగి ఇరువురి బంధువుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. తమపై ఆశా బంధువులు దాడికి దిగారని చింతపల్లి సత్యానందం, చింతపల్లి బుల్లమ్మ, గంధం నాగన్న, సారిక రాజేష్, సారిక కుమార్ తెలిపారు. క్షతగాత్రులకు స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అందించగా, పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎరువుల దుకాణాలపై దాడులు



పెద్దాపురంలో ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న అధికారులు

పెద్దాపురం: స్థానిక ఎరువుల దుకాణాలను వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్ (గుంటూరు), డీడీఏ త్రినాథస్వామి (కాకినాడ), విజిలెన్స్ శాఖ ఐటీపీ డీవీవీ సతీష్‌కుమార్ (శ్రీకాకుళం) బృందం సోమవారం తనిఖీ చేసింది. తాళ్లూరి సూర్యనారాయణ అండ్ సన్స్ ఎరువుల దుకాణంలో తనిఖీలు నిర్వహించిన బృందం రిజిస్టర్లు సక్రమంగా ఉన్నాయని సంతృప్తి వ్యక్తం చేసింది. అనంతరం స్థానిక విలేకర్లతో వారు మాట్లాడుతూ ఎరువులు, పురుగుల మందుల విక్రయాల్లో అవకతవకలు జరగకుండా ముందస్తు తనిఖీలు చేపడుతున్నామన్నారు. ఎరువుల దుకాణాల్లో ఎటువంటి తేడాలున్నా సంబంధిత డీలర్లపై చర్యలు తప్పవన్నారు. ఈ తనిఖీల్లో పెద్దాపురం, పెదపూడి మండలాల వ్యవసాయ అధికారులు కె.సంజయ్ కుమార్, మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.

కాపాడికుంటే సిరులే..

- లేగదూడల సంరక్షణ అవశ్యం
- బొడ్డువాపు వ్యాధి అత్యంత ప్రమాదం
- జాగ్రత్తలు తీసుకుంటే నిర్మూలన సాధ్యం





ఎల్.అనిత

అలమూరు: ప్రస్తుతం పాడి పరిశ్రమ సిరులు కురిపిస్తోంది. రైతులకు అదనపు ఆదాయం తీసుకు వస్తోంది. పుట్టిన లేగ దూడ విషయంలో జాగ్రత్తలు తీసుకుంటే రేపటి పాడి పశువుగా మారి ఈ పరిశ్రమకు మరింత జీవనాధారం అవుతోంది. ఈ దూడలకు సంభవించే వ్యాధులను ఎప్పటికప్పుడు గమనించి తగిన సంరక్షణ చర్యలు పాటించడం ఎంతో ఉత్తమం. శుభ్రమైన వాతావరణంలో దూడలను పెంచడంతో పాటు నాణ్యమైన దాణా అందించడం ద్వారా వీటిని అరికట్టవచ్చు. లేగ దూడల్లో సీజనల్‌గా వచ్చే బొడ్డు వాపు వ్యాధికి నిర్ణీతమైన సమయంలో చికిత్స అవసరం. తద్వారా దూడల మరణాల శాతాన్ని తగ్గించవచ్చని ఆలమూరు వ్యవసాయ సహాయ సంచాలకులు ఎల్.అనిత చెప్పారు. పశువుకు దూడ జన్మించిన వెంటనే వైద్యుల సూచనలు, సలహాల మేరకు కనీస జాగ్రత్తలు తీసుకుంటే బొడ్డు వాపు వ్యాధి నిర్మూలన కష్టసాధ్యం కాదని వివరించారు.

ఎలా సంక్రమిస్తుందంటే..

లేగ దూడల్లో అన్నింటి కంటే బొడ్డు వాపు వ్యాధి అత్యంత ప్రమాదకరమైంది. అపరిశుభ్రమైన వాతావరణంలో పుట్టినా, ముర్రుపాలు తగిన రీతిలో సకాలంలో తాగించకపోయినా ఈ వ్యాధి సంక్రమిస్తుంది. దీనిని సకాలంలో అరికట్టకపోతే ప్రమాదకర పరిణామాలకు దారితీసే అవకాశం ఉంది. సాధారణంగా దూడ పుట్టిన నాలుగు రోజుల నుంచి నెల రోజుల లోపు తీవ్ర జ్వరం వస్తే, దానిని బొడ్డు వాపు లేదా బొడ్డువాపు జ్వరం (అంబ్లికల్ ఏబ్సెస్)గా గుర్తించాలి. పాడి రైతు సత్వరమే పశు వైద్యాధికారిని సంప్రదించి లేగదూడ పరిస్థితిని వివరించాలి. దూడ పుట్టిన సమయంలో బొడ్డు నరాన్ని సరిగ్గా కట్ చేయకపోవడం వల్ల ఎక్కువగా ఈ వ్యాధి సోకే అవకాశం ఉంది. ఎందుకంటే బొడ్డు నరం ద్వారా శరీరంలోకి సూక్ష్మజీవులు ప్రవేశించి బొడ్డు వాపును కలిగించి తద్వారా వ్యాధి వచ్చే అవకాశం ఉందని పశు వైద్యులు చెబుతున్నారు. ఒక్కోసారి బొడ్డును కోసేందుకు వినియోగించే బ్లేడు తుప్పు పట్టినా, స్టెరిలైజ్ చేయకపోయినా ఈ వ్యాధి సోకుంది. పశువుల మకాంలో దగ్గర దగ్గరగా

పాడి-పంట

కట్టిన దూడలు చప్పరించడం వల్ల గాని, నేలను తాకి మట్టిని తినడం వల్ల ఈ వ్యాధి సోకే ప్రమాదముంది.

వ్యాధి లక్షణాలు

- ఈ వ్యాధి సోకిన లేగ దూడకు తొలుత బొడ్డు వద్ద వాపు వస్తుంది. అది క్రమేపి పెద్దదవుతూ దుర్వాసనతో కూడిన చీము కారుతుంది.
- దూడకు జ్వరం వచ్చి తగ్గకపోవడంతో నీరసించి పోతుంది. తల్లి పాలు తాగలేదు.
- ముక్కు నుంచి నీరు కారిపోతూ శ్వాస తీసుకునేందుకు కష్టపడుతోంది. మలవిసర్జన సక్రమంగా జరగక మలబద్దకంతో బాధ పడుతుంది.

చికిత్సా విధానం

బొడ్డు వ్యాధి నివారణకు సుమారు పది రోజులు పడుతుంది. వాపు గట్టిగా ఉన్నట్లయితే మెత్తబడే వరకూ అయోడిన్ ద్రావణంతో మర్దనా చేయాలి. పలుచని వస్త్రంలో ఉప్పుకట్టి వేడి నీటితో కాపడం పెట్టాలి. వాపు బాగా మెత్తబడిన తరువాత గడ్డ మధ్యలో రంధ్రం చేసి చీమును పూర్తిగా పిండేయాలి.

పొటాషియం పర్మాంగనేట్ ద్రావణంతో లోపలి వరకూ మూడుసార్లు కడిగి దూదితో పొడిగా తుడవాలి. టించర్‌లో ముంచిన బాండేడ్ క్లాత్‌ను రంధ్రంలోకి సరిపడా ఎక్కించాలి. రోజు విడిచి రోజు టించర్ క్లాత్‌ను మార్చాలి. ఇన్‌ఫెక్షన్ తగ్గే వరకూ యాంటి బయోటిక్ మందులను దూడకు అందజేయాలి. లేగ దూడలు బలహీనంగా ఉంటే గ్లూకోజ్, బీ కాంప్లెక్స్ ఇంజెక్షన్లు ఇవ్వాలి.

నివారణ చర్యలు

- పశువులు ఉండే ప్రదేశాన్ని తొలుత పరిశుభ్రం చేయాలి. ఆ పాక చుట్టూ సూక్ష్మజీవులు దరిచేరకుండా వ్యాధికారక నివారణ మందును పిచికారీ చేయించాలి.
- బొడ్డు వ్యాధి సోకిన దూడను సత్వరమే మంద నుంచి వేరుచేసి తగ్గిన తరువాత మాత్రమే మళ్లీ కలపాలి.
- బొడ్డు నరాన్ని రెండు అంగుళాలు వదిలి కత్తిరించేటప్పుడు కొత్త పరికరాన్ని మాత్రమే వినియోగించాలి. కత్తిరించిన తరువాత మూడు రోజుల వరకూ టించర్‌ను అద్దుతూ ఉండాలి. కాకులు, కోళ్ల ముక్కుతో పొడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- లేగ దూడ పుట్టిన వెంటనే మూతికి బుట్టలు కాని చిక్కాలు కాని అమర్చాలి.

భర్త వేధింపులపై ఫిర్యాదు

ముమ్మిడివరం: తన భర్త వేరే మహిళతో అక్రమ సంబంధం పెట్టుకుని తనను వేధింపులకు గురి చేస్తున్నాడని ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి.సురేష్‌బాబు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ముమ్మిడివరం నగర పంచాయతీ దొమ్మేటివారిపాలేనికి చెందిన గౌతమికి అయినవిల్లి మండలం తొత్తరమూడికి చెందిన మోరంపూడి శ్రీనివాసరావుతో 2021లో వివాహం జరిగింది. ఆ సమయంలో రూ. ఐదు లక్షల కట్నం, నాలుగు తులాల బంగారు ఆభరణాలు తదితరాలను శ్రీనివాసరావుకు ఇచ్చారు. తన భర్త ఆఫీస్‌లోని సహాయకురాలితో వివాహేతర సంబంధం పెట్టుకుని తనను నిర్లక్ష్యం చేశాడని గౌతమి ఫిర్యాదులో పేర్కొంది. పెద్దల సమక్షంలో కాపురం సక్రమంగా చేసుకుంటానని భర్త చెప్పాడని, అయినా మార్పు లేకపోగా తనపై భౌతిక దాడులకు దిగి చంపుతానని బెదిరించడంతో చుట్టుపక్కల వారు తనను పుట్టింటికి పంపించారని ఆమె చెప్పింది. తనను భర్తతో పాటు అత్తమామలు, ఆడపడుచు వేధించినట్లు ఫిర్యాదులో వివరించింది.

గంజాయితో యువకుడి అరెస్ట్

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలో గంజాయి ప్యాకెట్లతో యువకుడిని అరెస్ట్ చేసినట్లు సోమవారం ఎస్సై మురుగానందన్ తెలిపారు. కురసాంపేటకు చెందిన 22 ఏళ్ల బళ్ల జోజి అనే యువకుడి నుంచి సుమారు రూ.20 వేల విలువచేసే గంజాయి ప్యాకెట్లను ప్రత్యేక బృందం స్వాధీనం చేసుకుందన్నారు. కొత్తపల్లి మండలం ఉప్పాడ వద్ద సేకరించిన గంజాయిని యానాం తీసుకువచ్చి ప్యాకెట్ రూ.500 చొప్పున విక్రయిస్తున్నాడని ఎస్సై తెలిపారు. నిందితుడిని యానాం సబ్ కోర్టులో ప్రవేశపెట్టగా రిమాండ్ విధించారన్నారు.

ఆదిలోనే ఆటంకాలు



తీపర్రులో ఇసుక అమ్మకాలకు సిద్ధంగా ఉన్న అధికారులు



తీపర్రులో ఇసుక నిల్వలు

- నిలిచిన ఉచిత ఇసుక విధానం
- ఇంకా ధర నిర్ణయించని వైనం

పెరవలి: ఉచిత ఇసుక అన్నారు.. సోమవారం నుంచి మొదలన్నారు.. తీరా వెళ్లాక జీఓ రాలేదంటూ వెనక్కి పంపేశారంటూ వినియోగదారులు గగ్గోలు పెట్టారు. కూటమి ప్రభుత్వం అట్టహాసంగా ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక విధానానికి తొలిరోజే ఆటంకం ఎదురైంది. అన్ని సిద్ధం చేసినా సోమవారం ఇసుక పంపిణీ జరగలేదు. విధి విధానాలపై ప్రభుత్వం జీఓ విడుదల చేయాల్సి ఉన్నా మధ్యాహ్నం వరకూ రాకపోవటంతో అమ్మకాలు నిలిచిపోయాయి. గుట్టల వద్దకు కూలీలు, పొక్లెయిన్, అధికారులు వచ్చినా జీఓ కోసం ఎదురు చూసి, చివరికి ఎక్కడి వారు అక్కడకు వెళ్లిపోయారు. మధ్యాహ్నం 2 గంటలకు ప్రభుత్వ జీఓ వచ్చింది. ఇందులో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన కమిటీ ఏర్పాటు చేసి, ధరలు నిర్ణయించాలని ఉంది. కమిటీ ఏర్పాటు జరగకపోవడంతో మంగళవారం కూడా అమ్మకాలు జరిగే అవకాశం లేదని అధికారులు అంటున్నారు. తీపర్రు ఇసుక నిల్వల వద్ద సుమారు 50 వేల క్యూబిక్ మీటర్లు, కానూరు- పెండ్యాల ఇసుక ర్యాంప్ వద్ద 70 వేల క్యూబిక్ మీటర్ల ఇసుక అందుబాటులో ఉందని మైనింగ్ అధికారులు నిర్ధారించడంతో ఇసుక కోసం ఇక్కడకు ఉదయం వచ్చిన లారీలు, ట్రాక్టర్లు తిరిగి వెళ్లిపోయాయి. ప్రతి ఇసుక గుట్ట వద్ద మండల స్థాయి అధికారితో పాటు వీఆర్వోలు, వీఆర్ఏలు నియమించటంతో గుట్టల వద్దకు వారు వచ్చారు. తీరా జీఓ విడుదలలో జాప్యం కారణంగా అధికారులు వేచి ఉండాల్సి వచ్చింది. ఇసుక కోసం వచ్చిన వారు యూనిట్‌కి ఎంత చెల్లించాలి, ఏం కావాలని అడగటంతో విధి విధానాలు లేకే ఇసుక అమ్మకాలు చేపట్టలేదని అధికారులు సమాధానం చెప్పడం గమనార్హం.

పిల్లల్లో దేశభక్తి నింపాలి



బాలవికాస్ కేంద్రం ప్రారంభోత్సవంలో ముకుందన్

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): నైతిక విలువలు నేర్పించి, ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే శ్రీసత్యసాయి బాలవికాస్ తరగతులకు చిన్నారులను పంపాలని శ్రీసత్యసాయి సేవా సంస్థల దక్షిణ భారతదేశ సమన్వయకర్త ముకుందన్ కోరారు. రాజమహేంద్రవరం విద్యానగర్ శ్రీసత్యసాయి సేవా సమితి పరిధిలోని సెంట్రల్ జైల్ క్వార్టర్స్ వద్ద సేవా సమితి కన్వీనర్ కేఎస్‌వీ సత్యనారాయణ ఆధ్వర్యంలో బాలవికాస్ రెండో కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. దేశభక్తి, దైవభక్తి చిన్నారుల్లో నింపాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఆదర్శ పౌరులుగా తీర్చిదిద్దే బాలవికాస్ ఆవశ్యకతను అందరూ గుర్తించాలని రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు తెలిపారు. ఎందరినో ఉత్తమ విద్యార్థులుగా తయారు చేసిన సీనియర్ బాలవికాస్ గురువు, సేవా సమితి కన్వీనర్ సత్యనారాయణ నిస్వార్థ సేవలు అభినందనీయమని జిల్లా అధ్యక్షుడు బులుసు వెంకటేశ్వర్లు ప్రశంసించారు. వచ్చే నెల 2, 3, 4 తేదీలలో నిర్వహించే పుట్టపర్తి యాత్రకు కుటుంబ సమేతంగా రావాలని ఆయన కోరారు. స్థానిక బాలవికాస్ కేంద్రానికి గురువుగా పి.జ్యోతిని నియమించి, విద్యార్థినీ, విద్యార్థులకు పెన్నులు, నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఆధ్యాత్మిక విభాగ సమన్వయకర్త ఎస్‌వీ సాయిరాం, జిల్లా విద్యా విభాగ సమన్వయకర్తలు శ్రీనివాసరాజు, నిహారిక, స్థానిక బాలవికాస్ గురువులు జి.సూర్యకళ, ఈఎస్ ప్రకాశరాజు, ఎస్.సుభాష్ రెడ్డి సెంట్రల్ జైలు క్వార్టర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు కాకినాడలో జాబ్ మేళా

కాకినాడ సిటీ: కాకినాడలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో 10న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి శ్రీనివాసరావు తెలిపారు. దక్కన్ ఫైన్ కెమికల్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో 200 మంది ట్రైనీ కెమిస్ట్ ఉద్యోగాల కోసం బీఎస్సీ కెమిస్ట్రీ, డిప్లొమో ఇన్ కెమికల్ ఇంజినీరింగ్‌లో డిగ్రీ చేసిన 18–27 ఏళ్ల పురుష అభ్యర్థులు కావాలన్నారు. వీరు తునిలో పని చేయాలన్నారు. వరుణ్ మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 48 టెక్నీషియన్, సీనియర్ టెక్నీషియన్, పెయింటర్, డెంటర్, సీనియర్ డెంటర్, సీనియర్ పెయింటర్స్, సేల్స్ ఎగ్జిక్యూటివ్ అడ్వయిజర్ పోస్టులను భర్తీ చేయనున్నారు. ఈ పోస్టులకు ఐటీఐ డీజిల్ మెకానికల్ లేదా డిప్లొమో అన్ని ట్రేడులు, బీటెక్ మెకానికల్ ఇంజినీరింగ్, ఏదైనా డిగ్రీ చదివి ఉండాలన్నారు. ఆటోమొబైల్‌లో రెండేళ్ల నైపుణ్యం కలిగి ఉన్న వారు అర్హులన్నారు. ఈ పోస్టులకు పురుష అభ్యర్థులు మాత్రమే అర్హులన్నారు. కాకినాడ, పెద్దాపురం పట్టణాల్లో పని చేయాలన్నారు. ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్‌లో 200 మంది అభ్యర్థులు కావాలని, ఎస్ఎస్‌సీ నుంచి డిగ్రీ వరకూ చదువుకున్న 18 ఏళ్ల నుంచి 40 ఏళ్ల లోపు వారు అర్హులన్నారు. వీరు కాకినాడ, రాజమహేంద్రవరం తదితర ప్రాంతాల్లో పని చేయాల్సి ఉంటుందన్నారు. ఎస్‌కేఎల్ అసోసియేట్స్‌లో టెలీకాలింగ్ ఎగ్జిక్యూటివ్, డేటా ఎంట్రీ అసిస్టెంట్, ఫ్రంట్ ఆఫీస్ ఎగ్జిక్యూటివ్‌గా పని చేసేందుకు 60 మంది 18–35 ఏళ్ల లోపు అభ్యర్థులు కావాలన్నారు. వీరు కాకినాడ, చోడవరం, విశాఖపట్నం, హైదరాబాదుల్లో పని చేయాల్సి ఉంటుందన్నారు.

హక్కుల పరిరక్షణకు మరో స్వాతంత్య్ర పోరాటం

- ఐఏఎల్ రాష్ట్ర అధ్యక్షుడు ముప్పాళ్ల సుబ్బారావు
- కాకినాడలో ఏఐఎస్ఎఫ్ రాజకీయ శిక్షణ తరగతులు



ఏఐఎస్ఎఫ్ రాజకీయ శిక్షణ తరగతుల్లో ప్రసంగిస్తున్న ముప్పాళ్ల సుబ్బారావు

కాకినాడ సిటీ: ప్రధాని మోదీ హయాంలో దేశంలో మానవ, ప్రజాస్వామ్య, రాజ్యాంగ హక్కులు హరించుకుపోయాయని, మరోసారి ఆయన అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో హక్కుల పరిరక్షణకు అన్ని వర్గాల ప్రజలూ మరో స్వాతంత్య్ర పోరాటం చేయాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని పౌర హక్కుల సంఘం, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లిబర్టీ (ఐఏఎల్) రాష్ట్ర అధ్యక్షుడు ముప్పాళ్ల సుబ్బారావు అన్నారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర స్థాయి విద్య, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణ తరగతులు సోమవారం కాకినాడలో ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ తరగతుల ప్రారంభం సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జెండాను ముప్పాళ్ల ఆవిష్కరించారు. అనంతరం ‘రాజ్యాంగంలో హక్కులు – సమాచార హక్కు చట్టం’ అనే అంశంపై ప్రసంగించారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ మను రాజ్యాంగాన్ని అమలు చేసేందుకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని విమర్శించారు. ఇటువంటి వాటిని వ్యతిరేకించే దిశగా, రాజ్యాంగ హక్కులను పరిరక్షించే దిశగా విద్యార్థులు కృషి చేయాలని అన్నారు. రాజకీయ శిక్షణ తరగతులను ప్రారంభించిన మాజీ ఎమ్మెల్సీ, ఉపాధ్యాయ ఉద్యమ నేత కత్తి నరసింహారెడ్డి ‘నూతన విద్యా విధానం – విద్యార్థులపై దాని ప్రభావం’ అనే అంశంపై మాట్లాడారు. నూతన విద్యావిధానం వల్ల మన దేశ సంస్కృతీ సంప్రదాయాలు తదితర అంశాలు తెలియకుండా పోతున్నాయని అన్నారు. ఢిల్లీ పాలకులు వారికి ఇష్టం వచ్చినట్లు నూతన విద్యా విధానాన్ని అమలు చేసేందుకు చర్యలు చేపడుతున్నారన్నారు. నీట్ పరీక్షల్లో ఫస్ట్ ర్యాంకు సాధించిన విద్యార్థులు సైతం సరైన అవగాహన లేకుండా ఉన్నారన్నారు. నూతన విద్యా విధానం వల్ల ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు తరలిపోతున్నారని నరసింహారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకుడు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డేగ ప్రభాకర్ మాట్లాడుతూ, మోదీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని హామీ ఇచ్చారన్నారు. ఈ పదేళ్లలో 20 కోట్ల ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉండగా, కనీసం 20 లక్షలు కూడా ఇవ్వలేదని చెప్పారు. మూడోసారి ఇతర మార్గాల్లో అధికారంలోకి వచ్చారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు సీహెచ్ రాజబాబు, జాన్సన్‌బాబు, కావ్య నాగభూషణ్, కుళ్లాయిస్వామి, కె.శివారెడ్డి, తాటిపాక మధు తదితరులతో పాటు 26 జిల్లాల నుంచి విద్యార్థినీ విద్యార్థుల ప్రతినిధులు పాల్గొన్నారు.

హాకీ పోటీల్లో కాకినాడ జట్టు విజయం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఎస్‌డీఓ శ్రీనివాస్‌కుమార్ తదితరులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కేంద్రీయ విద్యాయల రీజినల్ స్పోర్ట్స్‌లో భాగంగా సోమవారం కాకినాడ డీఎస్ఏ క్రీడా మైదానంలో హాకీ పోటీలు జరిగాయి. తొలుత ముఖ్య అతిథి, డీఎస్‌డీఓ శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ క్రీడల్లో రాణించే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కేంద్రీయ విద్యాలయ కాకినాడ ప్రిన్సిపాల్ బి.శేఖర్ మాట్లాడుతూ ఈ పోటీలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం పోటీల్లో పాల్గొన్న కాకినాడ, నిజామాబాద్ జట్లను అతిథులు పరిచయం చేసుకుని మ్యాచ్‌ను ప్రారంభించారు. హోరాహోరీగా జరిగిన మ్యాచ్‌లో నిజామాబాద్‌పై కాకినాడ జట్టు 7–2 స్కోర్‌తో విజయం సాధించింది. విజేతలను బి.శ్రీనివాస్, శేఖర్‌లు అభినందించారు. కార్యక్రమంలో డీఎస్ఏ హాకీ కోచ్ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆనందమెటా..

- వాట్సాప్‌లో కొత్త ఫీచర్
- ఏ సమాచారమైనా చిటికెలో..
- ఉమ్మడి జిల్లాలో పెరిగిన వినియోగం



వాట్సాప్‌లో కనిపించే మెటా ఏఐ

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): స్మార్ట్ ఫోన్ల వినియోగం పెరిగింది.. సాంకేతికత అరచేతిలోకి వచ్చింది.. తద్వారా కొత్త టెక్నాలజీ ప్రతి ఒక్కరికీ చేరుతోంది.. ప్రస్తుత రోజుల్లో అన్ని రంగాల్లో కృతిమ మేధ (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్–ఏఐ) వినియోగం అనివార్యమైంది. ఈ– కామర్స్ మొదలు సోషల్ మీడియా వరకూ అన్ని రంగాల్లో ఏఐ వినియోగం పెరిగింది. ఇప్పటికే పలు దిగ్గజ సంస్థలు ఏఐ సేవలను అందుబాటులోకి తీసుకురాగా.. తాజాగా ప్రముఖ సోషల్ మీడియా సంస్థ మెటా సైతం అదే దూకుడును ప్రదర్శిస్తోంది. ఎక్కువ మంది ఉపయోగిస్తున్న మెసేజింగ్ యాప్ ‘వాట్సాప్’ తాజాగా ఏఐ రంగంలోకి కూడా అడుగు పెట్టింది. ప్రస్తుతం ఏఐ టెక్నాలజీకి పెరుగుతున్న డిమాండ్ నేపథ్యంలో మెటా ఏఐ పేరుతో కొత్త ఫీచర్‌ను పరిచయం చేసింది. వారం రోజులుగా వాట్సాప్ ఓపెన్ చేయగానే చాలామంది స్మార్ట్ ఫోన్‌లో రౌండ్‌షేప్‌లో ఓ సింబల్ కనిపిస్తోంది. అదే మెటా ఏఐ. ఇప్పటికే ఉమ్మడి జిల్లాల్లో వినియోగదారులు దీనిని సద్వినియోగం చేసుకుంటున్నారు.

క్షణాల్లోనే అడిగిన సమాచారం

వాట్సాప్ ఓపెన్ చేయగానే సెల్‌ఫోన్‌లో కుడివైపున రౌండ్ సింబల్‌ను క్లిక్ చేసిన తరువాత టరమ్స్ అండ్ కండీషన్స్ యాక్సెప్ట్ చేయగానే మెటా ఏఐ విత్ లామా అనే చాటింగ్ పేజీ ఓపెన్ అవుతుంది. మీ ఫ్రెండ్ లేదా, ఇంకెవరితోనైనా ఎలాగైతే చాట్ చేస్తామో అలాగే మెటా ఏఐ ద్వారా కూడా చాట్ చేయవచ్చు. మీకు ఏ సమాచారం కావాలన్నా, అందులో టైప్ చేసి సెండ్ చేయగానే క్షణాల్లో సమాచారం లభిస్తుంది. ఉదాహరణకు రాజమహేంద్రవరంలో బెస్ట్ లాడ్జి ఏది? అని అడిగితే వెంటనే అందుకు సంబంధించిన లిస్ట్ ప్రత్యక్షమవుతోంది. తిరుమలలో అద్దె గదులు పొందడమెలా అని అడిగితే సమాచారం వస్తుంది. అలాగే మీకు ఇంకేదైనా ఫొటో కావాలన్నా క్షణాల్లో అందిస్తుంది. తాజాగా రిలీజ్ అయిన సినిమాల వివరాలు కావాలన్నా తెలుసుకోవచ్చు. విద్య మొదలు వైద్యం వరకూ అనేక రకాల ప్రశ్నలకు మెటా ఏఐ మనకు సమాధానం ఇస్తుంది. అయితే ప్రస్తుతం ఇంగ్లిష్‌లో మాత్రమే సమాచారం ఇస్తోంది. రానున్న రోజుల్లో మాతృభాషలో కూడా అందిస్తారేమో చూడాలి.

ఎంతో ఉపయోగకరం



తాగాజా వాట్సాప్ ద్వారా వచ్చిన కొత్త ఫీచర్ మెటా ఏఐని నేను ఉపయోగిస్తున్నా. ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంది. ఏ సమాచారం కావాలన్నా అందిస్తోంది. ఏఐకి మంచి భవిష్యత్తు ఉంది. అవసరం లేనివారు దీనిని డెలీట్ కూడా చేసుకోవచ్చు.

–మోటూరి వినయ్‌కుమార్, బీటెక్ విద్యార్థి

ఏదైనా తెలుసుకోవచ్చు



ఇన్నాళ్లు ఏదైనా సమాచారం కావాలంటే గూగుల్‌లో సెర్చ్ చేసేవాళ్లం. ఇప్పుడు వాట్సాప్‌లో వచ్చిన కొత్త ఫీచర్ మెటా ఏఐనిఅడుగు అంటున్నారు. మెటా ఏఐ అనేది ఉచిత ఆర్టిఫియల్ ఇంటెలిజెన్స్ అసిస్టెంట్. మీరు ఎలాంటి ప్రశ్న అడిగినా సమాధానం ఇస్తుంది. కొత్త ప్రదేశాలకు వెళ్లినప్పుడు మనకు ఏ సమాచారం కావాలన్నా దీనిద్వారా తెలుసుకోవచ్చు.–పల్లి సుధా, అధ్యాపకురాలు, ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రాజమహేంద్రవరం